సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక వర్గం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్!

నందలూరులో కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైల్వే ఇన్‌స్టి ట్యూట్ పాలకవర్గం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ పడింది. - 8లో



తెలుగుభాషాభివృద్ధిపై ఆశలు

అధికార భాషా సంఘానికి అధ్యక్షుడు, సభ్యులను నియమించడంతో తెలుగు భాషాభివృద్ధిపై ఆశలు పెరుగుతున్నాయని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
35.4/17.6

వాతావరణం

జిల్లాలో శనివారం 17.6 - 35.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

ప్రతిధ్వనించిన పంచాక్షరి

కొండకోనల్లోని శైవ క్షేత్రాలు జనసంద్రాలయ్యాయి. లోయల్లో పంచాక్షరి ప్రతిధ్వనించింది. శివయ్య దర్శనం కోసం భక్తులు కనుచూపుమేర బారులు తీరారు. శివరాత్రి పర్వదిన సందర్భంగా లింగమూర్తిని మనసారా దర్శించుకుని తన్మయులయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి శక్తికొద్ది పూజలు చేసి తృప్తి చెందారు. హరోం హర...శివశంకర....అంటూ శైవ క్షేత్రాలన్నీ పంచాక్షరి నామంతో ప్రతిధ్వనించాయి.

- పోటెత్తిన శైవక్షేత్రాలు
- శివయ్యకు ఘనంగా పూజలు


పెండ్లిమర్రి: పొలతలలో భక్తుల రద్దీ


ప్రత్యేక అలంకరణలో ఉన్న పొలతల మల్లేశ్వరస్వామి

కడప కల్చరల్: శివరాత్రి పర్వదిన సందర్భంగా శనివారం జిల్లాలోని శైవ క్షేత్రాలు గల కొండ కోనలు భక్తులతో నిండిపోయాయి. దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఉదయం 4 గంటల నుంచి శివాలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలకు నగరం నుంచేగాక సమీపంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కుటుంబాలతో సహా తరలి వెళ్లారు. లక్షలాది జనం రావడంతో కొండకోనలు రద్దీగా మారాయి. ఓ దశలో అడుగు తీసి అడుగు వేసేందుకు కూడా కష్టమైంది. అయినా భక్తులు అడుగడుగునా శివనామ స్మరణతో ఉత్సాహం తెచ్చుకుంటూ ఆ శ్రమను మరిచారు. స్వామిని దర్శించుకుని తన్మయులయ్యారు.

అన్ని క్షేత్రాలు రద్దీగానే

జిల్లాలో శివరాత్రి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించే జిల్లాలోని అన్ని శైవ క్షేత్రాలు భక్తులతో రద్దీగా మారాయి. జిల్లా కేంద్రమైన కడప నగరంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా నగర పరిధిలోని కొండాయపల్లె ఉమామహేశ్వరస్వామి ఆలయం, రామనపల్లె, నానాపల్లెల్లోని శివాలయాలకు వెళ్లి సీనియర్ నాయకులు మాసీమబాబు, నగర కార్పొరేటర్లు, స్థానిక నాయకులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు, కమిటీ పెద్దలు వారికి ఘనంగా స్వాగతం పలికి శివ దర్శనం చేయించి వేదాశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

- పొలతల క్షేత్రానికి ఎప్పటిలాగా భక్తజనం పోటెత్తారు. అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం ఎదురు కాలేదు. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సతీసమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పట్టు వస్త్రాలను తలపై మోసుకొచ్చి భక్తిశ్రద్ధలతో స్వామి, అమ్మవార్లకు సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోనే జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయకమిటీ చైర్మన్, సభ్యులు, స్థానిక ప్రముఖులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే వీఎన్ పల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన సంగమేశ్వరాలయంలో జరిగిన శివరాత్రి పూజల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రొద్దుటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శివరాత్రి సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఖాజీపేట పరిధిలోని శ్రీ నాగనాథేశ్వరస్వామి క్షేత్రంలో కూడా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలతోపాటు ఆలయానికి వచ్చే మార్గం కూడా భక్తులు, వాహనాలతో రద్దీగా మారింది. స్థానిక ప్రముఖులు శివ దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. నిత్యపూజకోనలో భక్తులు పెద్ద ఎత్తున శివరాత్రి పూజలకు హాజరయ్యారు. కడప నగర మేయర్ సురేష్ బాబు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొండ మెట్ల దారిన ఆయన శ్రమించి కోనకు వెళ్లి స్వామి దర్శనం చేసుకున్నారు. అక్కడి ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాల గురించి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.


పెండ్లిమర్రి: పొలతలలో కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులు


భక్తజనం

శుక్రవారం రాత్రికే శైవ క్షేత్రాలన్నీ భక్తులతో నిండిపోవడంతో శనివారం ఉదయం స్వామిని దర్శించుకున్న భక్తుల్లో పలువురు తిరిగి తమ ప్రాంతాలకు చేరుకున్నారు. స్థానికంగా గల శివాలయాలకు వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. మరికొందరు అటవీ ప్రాంతాల్లోని శివాలయాలలో జాగరణ చేస్తే మరింత పుణ్యం లభిస్తుందని భావించి అక్కడే ఉండిపోయారు. ఇంకొందరు సోమవారం మధ్యాహ్నం బయలుదేరి అటవీ ప్రాంతాల శైవ క్షేత్రాలకు వెళ్లారు. జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు భక్తులకు సులభంగా శివయ్య దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేశారు. ధార్మిక సంస్థలు, ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో దారి వెంట పలుచోట్ల మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. మరికొన్ని చోట్ల సోమవారం మధ్యాహ్నం అన్నదానాలు నిర్వహించారు. ప్రణాళిక ప్రకారం జిల్లా అధికారులు ముఖ్యంగా పోలీసుశాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది.

వాహన వితరణ: మొక్కులు గల భక్తులు అటవీ ప్రాంతంలోని శివాలయాలకు భక్తులను చేరవేసేందుకు లారీలు, మినీ బస్సులు, వ్యాన్లు ఉచితంగా ఏర్పాటు చేశారు. ఆటో లు కూడా పెద్ద సంఖ్యలో భక్తులను ఆయా క్షేత్రాలకు తీసుకెళ్లాయి. ఆర్టీసీ కూడా గతం కంటే ఎక్కువ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. అత్తిరాల, కన్యతీర్థం, రాయచోటి వీరభద్ర స్వామి ఆలయం, భానుకోట, అల్లాడుపల్లె వీరభద్ర స్వామి, ప్రొద్దుటూరులోని ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయం, అగస్త్యేశ్వరాలయం, బ్రహ్మంగారి మఠం, భైరవేశ్వరుని కోన, లంకమల తదితర శైవ క్షేత్రాలు కూడా భక్తులతో పోటెత్తాయి.

ఏకబిగిన అలుపు లేకుండా...ఎస్పీ

మైళ్ల కొద్ది రాళ్లు, రప్పలతో కూడిన కొండకోనల దారిలో జిల్లా ఎస్పీ ఏకబిగిన అలుపులేకుండా నడిచారు. పరిసరాలను పరిశీలిస్తూ ఆచితూచి అడుగేస్తూ వేగంగా నిత్యపూజస్వామి క్షేత్రానికి చేరుకున్నారు. శివరాత్రి ఉత్సవాలను పర్యవేక్షించేందుకు స్వయంగా క్లిష్టమైన అటవీ ప్రాంతం నిత్యపూజకోనకు వెళ్లారు. రాళ్లు, రప్పల దారిలో చెమటోడ్చుకుంటూ సిబ్బంది కంటే ముందు వేగంగా వెళ్లడం విశేషం. దారి వెంబడి వాహనాలు, వాహనదారులు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు సూచనలు, కొండదారి వెంబడి భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేస్తూ సాగారు. అలాగే పొలతల క్షేత్రానికి కూడా ఆయన వెళ్లి ఆ ప్రాంతమంతా కలియతిరిగి ఏర్పాట్లను పరిశీలించారు.


నిత్యపూజకోనకు రాళ్లు రప్పలను దాటుకుని వెళుతున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్



చాపాడు: ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి, అల్లాడుపల్లెలో జాగరణలో భక్తుల సందోహం



సిద్దవటం: నిత్యపూజ స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు, ప్రత్యేక అలంకరణలో నిత్యపూజస్వామి మూలవిరాట్


బద్వేలు అర్బన్: లంకమల క్షేత్రంలోని కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

ఆదర్శ సమాజ నిర్మాణమే ఇస్లాం ధ్యేయం


సామూహికంగా నమాజ్ చేస్తున్న ముస్లింలు

మదనపల్లె సిటీ: ఆదర్శ సమాజ నిర్మాణమే ఇస్లాం ధ్యేయమని ముస్లిం ఉలేమాలు, ధార్మిక గురువులు పేర్కొన్నారు. శనివారం మదనపల్లె పట్టణం కదిరిరోడ్డులోని టీపూ సుల్తాన్ వక్ఫ్‌మైదానంలో రెండు రోజుల ధార్మిక సదస్సు ఇజ్తిమా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ధార్మిక గురువులు మౌలానా మసీవుల్లా, మౌలానా అక్బర్‌షరీఫ్, ముఫ్తీ అస్లాంసాహెబ్, హాజీ ఫారూఖ్ అమీర్ సాహెబ్‌లు ధార్మికోపన్యాసం చేస్తూ మహాప్రవక్త హజరత్ మహమ్మద్ సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఇస్లాం సూచించిన ఐదు సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. దైవం ఒక్కటేనని విశ్వసించడం, ప్రతి రోజు ఐదు సార్లు నమాజ్ చేయడం, రంజాన్ మాసంలో 30 రోజుల పాటు ఉపవాసదీక్షలు చేపట్టడం, జకాత్ రూపంలో పేదలకు దాన,ధర్మాలు చేయడం ఇస్లాం మూలసూత్రాలన్నారు. మానవాళి సంక్షేమం, శాంతియుత, దైవభక్తితో కూడిన జీవన విధానం బోధించడమే ఇజ్తిమా లక్ష్యమన్నారు.

నేడు ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్ష

- పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు
- అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, తదితరాలలో ఏదో ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి
- నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



కడప అర్బన్: కడప నగరంలో ఈనెల 19న (ఆదివారం) నిర్వహించనున్న ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్షకు పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఈమేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకూ జరగనుంది. పరీక్షల సమయం కంటే ముందు గంట నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ జిల్లాకు సంబంధించి కడప నగరంలో ఏర్పాటు చేసిన 11 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 9540 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని ఎస్పీ తెలిపారు. 11 కేంద్రాలను నాలుగు రూట్లుగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపుకార్డు, పాన్ కార్డు, తదితర గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి ఒరిజినల్ తీసుకు రావాలన్నారు. సెల్‌ఫోన్, వాచ్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరని తెలిపారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం

లింగాల : మండల కేంద్రమైన లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం కేంద్ర బృంద సభ్యులు ప్రభాకర్ గుప్తా, జయప్రకాష్‌లు సందర్శించారు. వారు పీహెచ్‌సీలోని ఓపీ విభాగం, ల్యాబ్ రూం, ఫార్మసీ విభాగం తదితర వాటిని పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించారు. న్యాక్ జిల్లా కో.ఆర్డినేటర్ రమేష్, డాక్టర్లు సుభాషిణి, కళ్యాణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


ఫార్మసీ విభాగాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

పదిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి



సాక్షి ఇంటర్వ్యూ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులంతా వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం.. వారిలో పరీక్షలంటే భయం పోగొట్టి ప్రతి విద్యార్థి ఉత్తమ మార్కులను సాధించేలా కృషి చేస్తున్నాం. విద్యార్థులకు చదువంటే ఆసక్తి పెరిగేలా మోటివేషన్ క్లాసులను నిర్వహిస్తున్నాం. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 8175 మంది బడి బయట పిల్లలను గుర్తించి వారందరిని బడిలో చేర్పించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపాం.. అని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయనతో జరిపిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న: ఈ ఏడాది 2022–23 సంవత్సరంలో ఎంతమంది విద్యార్థులు పది పరీక్షలను రాస్తున్నారు?

జవాబు: వైఎస్సార్ జిల్లాలో 2022–23 విద్యా సంవత్సరంలో 28,273 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలను రాయనున్నారు. వీరికోసం జిల్లాలో 146 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశాం. పరీక్షా కేంద్రాలలో అన్ని రకాల మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పదవ తరగిత పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తాం.

ప్ర: వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు తీసుకున్న చర్యలేంటి?

జ: జిల్లాలో పది పరీక్షలను రాసే విద్యార్థులకు సమ్మెటివ్, ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను నిర్వహించాం. ఇందులో సి, డి గ్రేడులు వచ్చిన విద్యార్థులను గుర్తించాం. వారికి ఆయా సబ్జెక్టు టీచర్ల ద్వారా ప్రత్యేక క్లాసులను తీసుకుంటున్నాం.

ప్ర: జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను ఎంతమందిని గుర్తించారు?

జ: వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 3058 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించాం. వారందరికి భవితా కేంద్రాల ద్వారా ఐఈఆర్టీలను ఏర్పాటు చేసి విద్యనభ్యసించడమే కాకుండా, ఫిజియోథెరపిస్టుల ద్వారా స్పీచ్ థెరపిలతోపాటు పలు రకాల ఎక్సర్‌సైజులు చేయిస్తున్నాం. ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి వారికి అవసరమైన ఉపకరణాలను అందజేస్తున్నాం.

ప్ర: రాబోయే విద్యా సంవత్సరానికి జనగన్న విద్యాకానుకకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారా?

జ: రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లావ్యాప్తంగా 1,59,000 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక ద్వారా మూడు జతల యూనిఫాం, రెండు జతల సాక్సులు, ఒక జత బూట్లు, నోట్‌బుక్స్ ఆంగ్ల, తెలుగు నిఘంటువులు ఇవ్వనున్నాం.

ప్ర: 6,7,8 తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఈ విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా మోడల్స్ ప్రిపేర్ చేసి చదవడం, రాయడం, నేర్చుకున్నది చెప్పడం లాంటి కార్యక్రమాలను చేపట్టాం.

ప్ర: మనబడి నాడు నేడు రెండవ దశ పనులు ఎలా జరుగుతున్నాయి?

జ: మనబడి నాడు నేడు ద్వారా జిల్లా వ్యాప్తంగా 902 పాఠశాలలు, 96 అంగన్‌వాడీ కేంద్రాలు, 9 జూనియర్ కళాశాలల్లో రూ. 275 కోట్లతో పనులను ప్రారంభించాం.

ఆటోను ఢీకొన్న కారు

ఐదుగురు మహిళలకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన మహిళను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తదితరులు

వేంపల్లె : వేంపల్లె పట్టణ పరిధిలోని కడప రోడ్డులో ఉన్న సంచుల ఫ్యాక్టరీ వద్ద ఆటోను కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహా శివరాత్రిని పురస్కరించుకుని వేంపల్లె నుంచి వీరపునాయునిపల్లె మండలం అనిమెల గ్రామం వద్ద ఉన్న సంగమేశ్వర ఆలయానికి 8 మంది ఆటోలో బయలుదేరారు. సంచుల ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే ప్రొద్దుటూరుకు చెందిన కారు వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి అందుల ప్రయాణిస్తున్న 8మంది మహిళలు ఒకరిపై ఒకరు పడ్డారు. అందులో లహరి, లక్ష్మీదేవి, రిషిత, సుబ్బలక్షుమ్మ, గంగాదేవిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ బాషాకు స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన వారికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులను స్థానికులు ప్రాథమిక చికిత్స కోసం వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. వీరిలో లహరి, రుషిత, సుబ్బలక్షుమ్మల పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి ఆసుపత్రికి వచ్చి వారిని పలకరించారు. ఆటోను ఢీకొట్టిన కారును వదిలేసి వెళ్లిపోయారు. కారును వేంపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

సాహితీ నగరి.. 'భూతపురి'

- నేడు మహాకవి డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ జయంతి
- ఆయన పేరిట సాహిత్యపురస్కారనం ప్రదానం



డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ (ఫైల్)

కడప కల్చరల్ : ఆయన మహా పండితుడు..అవధాని..జ్యోతిష్యశాస్త్రం, వాస్తుశాస్త్ర నిపుణులు. జిల్లాలో ఇతరులెవ్వరికీ దక్కని గండిపెండేర సత్కారం, గజారోహణ అభినందనం కూడా అందుకుని జిల్లాకు గర్వకారణంగా నిలిచిన సాహితీవేత్త. ఆయనే మహాకవి, శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ. జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్న ఆయన 86వ జయంతిని ఆదివారం నిర్వహించనున్నారు. ఆయన పేరిట 21వ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన గురించిన పరిచయం.

జిల్లాకు కవుల గడపగా పేరుంది. ప్రముఖులైన కవులెందరో జిల్లా పేరును ఇనుమడింపజేశారు. వారిలో నిన్నటితరం కవి సంస్కృతాంధ్ర సాహితీవేత్త, మహావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ ముందు వరుసలో ఉంటారు. ఆయన రాసిన శ్రీకృష్ణభారతం తెలుగు సాహితీ లోకంలో విశిష్ట స్థానం పొందింది. వారి కుమారులు ఆయన పేరిట స్మారక ట్రస్టు ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఓ పండితునికి సాహిత్య పురస్కారాన్ని అందజేస్తున్నారు. అల్లసాని పెద్దన సాహితీపీఠంతో కలిసి ఏటా క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆయన పేరిట 21వ స్మారక అవార్డును ప్రముఖ సాహితీవేత్త ఆచార్య అనుమాండ్ల భూమయ్యకు అందజేయనున్నారు.

కవి డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 1938 ఫిబ్రవరి 14న వల్లూరు సమీపంలోని తప్పెట్ల కొత్తపల్లె గ్రామంలో జన్మించారు. తండ్రి సుబ్బయ్యశర్మ మహాపండితులు. ఆయన నుంచి కుమారుడు సుబ్రమణ్యశర్మకు సాహిత్య వారసత్వం లభించింది. తండ్రి వద్దే సంస్కృతాంధ్రలను అవపోసన పట్టారు. సరస్వతి పుత్రులు డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులకు ఏకలవ్య శిష్యుడిగా వ్యవహరించిన డాక్టర్ భూతపురి ఆయన ఆశీస్సులతోనే శ్రీకృష్ణ భారత కావ్యం రాశారు. ఆ గ్రంథాన్ని చదివిన పుట్టపర్తి దీనిని అధ్యయనం చేస్తే సంస్కారం అభివృద్ధి అవుతుందని పీఠిక రాశారు. సుప్రసిద్ధ కవి, విమర్శకులు ఆచార్య దివాకర్ల వెంకట అవధానితో ఉన్న పరిచయంతో ఓసారి డాక్టర్ భూతపురి తన కావ్యానికి పీఠిక రాయమని ఆయన ఇంటికి వెళ్లారు. ఆయన వెంటనే భూతపురిని శాస్త్రోక్తంగా తాంబూలం ఇచ్చి శాలువతో సత్కరించారు.

బహుముఖ ప్రజ్ఞ

డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన శ్రీరామభక్తుడు. తన రచనలన్నీ శ్రీరామునికే అంకితమిచ్చారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జ్యోతిష్యవిభాగానికి పుస్తకాలు రాయడంతోపాటు బోధన కూడా చేశారు. 1989లో డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యుల సమక్షంలో సువర్ణ గండపెండేర సత్కారం జరిగింది. 1997లో కడప నగరంలో గజారోహణం చేశారు. స్వర్ణ హస్త కంకణ సత్కారం స్వీకరించారు. ఉభయ కవి సార్వభౌమ బిరుదు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్, పలు సాహితీ సంస్థల నుంచి ఎన్నో బిరుదులు పొందారు. ఆయన పేరిట కుమారుడు డాక్టర్ శివరామ సురేంద్రశర్మ, డాక్టర్ గోపాలకృష్ణశాస్త్రిలు స్మారక సంస్థను ఏర్పాటు చేసి యేటా ఆయన జయంతి నాడు సాహితీవేత్తకు పురస్కారం ప్రదానం చేస్తున్నారు.

డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ పేరిట 21వ సాహిత్య పురస్కారాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించను న్నారు. వైవీయూ వీసీ ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

తెలుగుభాషాభివృద్ధిపై ఆశలు



డాక్టర్ తవ్వా వెంకటయ్యను సత్కరిస్తున్న స్థానిక స్వచ్ఛంద సంస్థలు

కడప కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అధికార భాషా సంఘానికి అధ్యక్షులు, సభ్యులను నియమించడంతో రాష్ట్రంలో తెలుగు భాషాభివృద్ధిపై ఆశలు పెరుగుతున్నాయని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి డాక్టర్ వి.బ్రహ్మయ్య పేర్కొన్నారు. జిల్లాకు చెందిన యువ సాహితీవేత్త డాక్టర్ తవ్వా వెంకటయ్యను సభ్యునిగా నియమించడమే ఇందుకు నిదర్శనమన్నారు. శనివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్యల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గ్రాండ్ ఇన్ హోటల్‌లో తవ్వా వెంకటయ్యకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తెలుగుభాషాభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. భాషకు ప్రాణం లాంటి సంస్కృతి సంప్రదాయాలు మరింత బలపడగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. సభాధ్యక్షుడు, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మానస కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులో పెద్ద పదవి రావడంతో వెంకటయ్య లాంటి నిత్య సాహితీ కృషీవలునికి తగిన గుర్తింపు లభించినట్లయిందన్నారు. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ కడప నగర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, లయన్ పోతుల వెంకట్రామిరెడ్డిలు మాట్లాడుతూ ప్రతినెల జిల్లాలో తెలుగుభాషాభివృద్ధి కోసం పాఠశాలల్లో అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యావేత్త అలపర్తి పిచ్చయ్యచౌదరి అధికారభాషా సంఘం విధి విధానాలను, బాధ్యతలను వివరిస్తూ వెంకటయ్య నియామకం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ప్రొద్దుటూరు-1 సర్కిల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఎ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి, వైవీయూ ఫైన్‌ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ కోటా మృత్యుంజయరావు, విద్యావేత్త పి.అక్బర్‌ఖాన్, వైవీయూ జర్నలిజం ఫ్యాకల్టీ డాక్టర్ సురేష్ మాట్లాడారు. అనంతరం కార్యనిర్వాహక సంస్థలు, పలు ఇతర సాహిత్య, కళా, వారసత్వ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డాక్టర్ తవ్వా వెంకటయ్యను సత్కరించారు. డాక్టర్ జీవీ సాయిప్రసాద్, పసుపులేటి శంకర్, ఓం శాంతి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అనంతరం డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ తనను విద్య, భాషా, సాహిత్యవేత్తగా తీర్చిదిద్దిన వారందరికి, ముఖ్యంగా తనకు ఈ పదవి ఇచ్చిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్!

- అభ్యర్థుల ఎంపికకు నేతల కసరత్తు
- 20 నుంచి నామినేషన్లు, 2న పోలింగ్



నందలూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వేకేంద్రంలో కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ పడింది.ఈ మేరకు గుంతకల్ రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ మేనేజరు జీఎస్ చౌహన్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు.పాలకవర్గంలో ఎన్నికలు జరిగే పదవులను వెల్లడించారు. సెక్రటరీ, జాయింట్‌సెక్రటరీ, కోశాధికారి, ఆరుగురు కమిటీ సభ్యుల పదవులకు అభ్యర్థులు పోటీపడున్నారు.

ఆంగ్లో ఇండియన్స్ నుంచి రైల్వే ఇన్‌స్టిట్యూట్ సంస్కృతి ఆవిర్భావం

బ్రిటీషు రైల్వేపాలకుల హయాం నుంచి నందలూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్ వైభవంగా వెలుగొందింది. ఆంగ్లో ఇండియన్‌కు చెందిన డాయల్‌దొర, హోప్రిన్‌దొర, మరికొన్ని కుటుంబాలు, వందలాది కార్మికులు సభ్యులుగా కొనసాగారు. స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ ఉన్నప్పటి నుంచి వివిధ విభాగాలకు చెందిన కార్మికులు, వారి కుటుంబాల కోసం రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ను 1920లో ఏర్పాటు చేశారు.శారీరక, మానసిక, విజ్ఞాన, క్రీడ, కళారంగానికి సంబంధించి అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తూవచ్చారు.కళాసమితి తరపున రాష్ట్రస్థాయిలో నాటకాలు, రంగస్థలం పోటీలు నిర్వహించేవారు.చాలా మంది సినీనటులు ఇక్కడికి వచ్చిన దాఖాలాలు ఉన్నాయి. హౌసీగేమ్ కోసం చెన్నై నుంచి హిగ్గిన్‌బోథమ్స్ పరికరాలు, నంబరుబోర్డు, నంబరు కాయిన్స్ గేమ్ నిర్వహణకు ఆదరణ ఉండేది. అలాగే రైల్వే టెన్నిస్‌కోర్టును వేదికగా చేసుకొని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రసంగాన్ని ఇప్పటికి పూర్వీకులు గుర్తుచేసుకుంటున్నారు.

ఈనెల 20 నుంచి రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఏర్పాటు కోసం నామినేషన్లను ఆహ్వానించనున్నారు. వచ్చేనెల 2న పోలింగ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 8 నుంచి సభ్యుల జాబితా.. 13 వరకు పరిశీలన, చేర్పులు , మార్పులు జరిగాయి. 15న సభ్యుల తుది జాబితాను సిద్ధం చేశారు. 15 నుంచి 20 వరకు నామినేషన్ ఫారాలను విడుదల చేశారు. ఈనెల 21న పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటించనున్నారు. 23న ఉపసంహరణ,24న నామినేషన్లను గుర్తించి, గుర్తులను ప్రకటించనున్నారు.పోలింగ్‌రోజునే కౌంటింగ్ నిర్వహించేలా రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికల్లో సౌత్‌సెంట్రల్‌మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘాలు పోటాపోటీ పడుతున్నాయి. దీంతో అభ్యర్థుల ఎంపికకు నేతలు కసరత్తు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో నందలూరులో రైల్వే ఎన్నికల వేడి రాజుకుంది.

పట్టపగలే ద్విచక్రవాహనానికి నిప్పు



కాలిపోయిన ద్విచక్రవాహనం

వేంపల్లె : వేంపల్లె గ్రామంలోని అమ్మవారిశాల వీధి వెనుక పట్టపగలే ద్విచక్రవాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో బైక్ పూర్తిగా కాలిపోయింది. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం వేంపల్లెలోని ప్రియా తోటకు చెందిన వెంకటరమణ ఏపీ39జెఎక్స్ 8009 అనే నంబరు గల బైక్‌ను అమ్మవారిశాల వెనుక వైపున పెట్టి సమీపంలో ఉన్న తోటలోకి వెళ్లాడు.తిరిగి వచ్చి చూడగా ద్విచక్రవాహనం కాలిపోయి ఉంది. ఇటీవల కాలంలో వరుసగా మోటారు బైక్‌లు, కార్లకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు నిఘా పెంచాలని, ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని, నిందితులను అదుపులోకి తీసుకోవాలనికోరుతున్నారు.

వైవీ రావు మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు

కడప సెవెన్‌రోడ్స్ : ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వైవీ రావు మృతి కార్మికోద్యమానికి తీరని లోటని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత రాత్రి 11 గంటలకు విజయవాడలోని తన స్వగృహంలో హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : విజయవాడ ఆర్టీసీ బస్టాండులో అసిస్టెంట్ డిపో క్లర్క్ (ఏడీసీ)గా పని చేస్తూ మృతి చెందిన వైవీ రావు లేని లోటు తీరలేనిదని ఎంప్లాయీస్ యూనియన్ కడప రీజినల్, అధ్యక్ష కార్యదర్శులు సుబాష్ బాబు, ఏఆర్‌మూర్తి తెలిపారు. ఆయన మృతికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కువైట్‌లో రోడ్డు ప్రమాదం

- కృష్ణంపల్లె వాసి మృతి
- సరైన సమాచారం లేక తల్లడిల్లుతున్న బంధువులు



కొడుకు, కూతురుతో జయరామిరెడ్డి (ఫైల్)

పోరుమామిళ్ల : మండలంలోని చల్లగిరిగెల పంచాయతీ క్రిష్ణంపల్లెకు చెందిన గోపవరం జయరామిరెడ్డి (40) కువైట్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సంఘటన జరిగి మూడు రోజులవుతున్నా సరైన సమాచారం లేదని మృతుడి తమ్ముడు దశరథరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశరథరామిరెడ్డి కథనం మేరకు జయరామిరెడ్డి కువైట్‌లో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన భార్య 9 సంవత్సరాల క్రితం క్యాన్సర్‌తో మృతి చెందింది. ఆయనకు రాముకార్తీక్‌రెడ్డి(14), తునుషి కౌసల్య(10) ఇద్దరు పిల్లలు. మూడు రోజుల క్రితం బస్తాల లోడుతో వెళుతున్న జయరామిరెడ్డి లారీ ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది.లారీలో ఉన్న జయరామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, కారులో ఉన్నవారిలో ముగ్గురు మృతి చెందారు., మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ప్రమాదం గురించి, జయరామిరెడ్డి మృతి గురించి కానీ ఇక్కడకు ఎవ్వరూ సమాచారం ఇవ్వలేదు. జయరామిరెడ్డి రెండు రోజులు ఫోన్ చేయకపోవడంతో దశరథరామిరెడ్డి ఫోన్ చేయడంతో విషయం తెలిసింది. జయరామిరెడ్డి ఫోన్ లిఫ్ట్ చేసిన వ్యక్తి ఆయన ప్రమాదంలో చనిపోయారని అరబిక్‌లో చెప్పాడు. దశరథరామిరెడ్డి కూడా గతంలో కువైట్‌లో ఉన్నందున భాష తెలిసి అన్న మృతి చెందాడని అర్థం చేసుకున్నాడు. అన్న పని చేస్తున్న సేట్‌కు ఫోన్ చేశాడు. సేట్ ప్రమాదంలో జయరామిరెడ్డి చనిపోయాడని, మృతదేహం ఆసుపత్రిలో ఉందని, ప్రాసెస్ పూర్తయితే ఇండియాకు పంపిస్తానని చెప్పాడు. రెండు రోజులుగా సేట్ నుండి ఎలాంటి సమాచారం లేదని, ఫోన్ చేస్తే ప్రాసెస్ జరుగుతున్నదని మాత్రమే చెపుతున్నాడని దశరథరామిరెడ్డి వివరించాడు.

కువైట్‌లో ఉన్న ఆంధ్రా ఎంబసీకానీ, ఆంధ్రా వ్యక్తులు కానీ అందుబాటులోకి రావడం లేదని, సరైన సమాచారం ఎవ్వరూ చెప్పడం లేదని దశరథరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మృతదేహం ఎప్పుడు పంపిస్తారు? ప్రమాదంపై కేసు నమోదు చేశారా? కేసు ఏమని రాశారు? తదితర సమాచారం ఏమీ తెలియడం లేదని బంధువులు చెబుతున్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

రాచర్ల : మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలోని సిద్ది భైరవేశ్వరస్వామి వారి మహాశివరాత్రి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎడ్ల పందేలను ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. నంద్యాల జిల్లా, నంద్యాల మండలం, బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్దన్ రెడ్డికు చెందిన ఎడ్లు నిర్ణీత 15 నిమిషాల్లో 1621 అడుగులు లాగి ప్రథమ బహుమతి సాధించాయి. వైఎస్సార్ జిల్లా, కాశినాయన మండలం, అనవారిపల్లె గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా రాజుపాలెంకు చెందిన బండి వెంకటశివారెడ్డి ఎడ్లు నాలగో స్థానంలో నిలిచాయి.

సత్తా చాటిన చాపాడు ఎడ్లు

గిద్దలూరు రూరల్ : మహా శివరాత్రి పండుగ సందర్భంగా పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో శనివారం నిర్వహించిన ఎడ్ల పోటీలు నిర్వహించారు. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన తేజశ్రీ ఎడ్లు 3480 అడుగులు బండను లాగి ప్రథమ, చాపాడు మండలం వీరతేజ ఎడ్లు 3005 అడుగులు లాగి ద్వితీయ, నంద్యాల జిల్లా కుమ్మలూరు గ్రామానికి చెందిన బీఎస్‌ఆర్ పల్లవిక ఎడ్లు తృతీయ,

ద్వితీయస్థానంలో దాసరిపల్లె ఎడ్లు

కంభం : మండలంలోని చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో అర్ధవీడు మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన సోమిశెట్టి రమేష్ ఎడ్లు 2730.10 అడుగులు లాగి ప్రథమస్థానంలో సత్తాచాటాయి. వైఎస్సార్ జిల్లా దాసరి పల్లి గ్రామానికి చెందిన శీలం రమేష్ ఎడ్లు, వైఎస్సార్ జిల్లా కలసపాడుకు చెందిన శంకరయ్య యాదవ్ ఎడ్లు, వైఎస్సార్ జిల్లా పెద్దజొన్నవరానికి చెందిన కాకి యుగంధర్ ఎడ్లు, రాణించాయి.

మల్లెంకొండలో రాజంపేట వాసి మృతి



శంకరయ్య

గోపవరం : శివరాత్రి పర్వదినం సందర్భంగా మల్లెంకొండేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రాజంపేటకు చెందిన శంకరయ్య (60) శనివారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బంధువులతో కలిసి మల్లెంకొండేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కొండ ఎక్కుతుండగా జారుడు బండ సమీపంలో ఆయాసంగా ఉందని శంకరయ్య తోటి వారికి తెలియజేశాడు. అక్కడే కొద్దిసేపు కూర్చున్నాడు. వెంటనే బంధువులు డోలి సహాయంతో కొండ కిందకు తీసుకొచ్చారు.వైద్యాధికారి డాక్టర్ నర్మద వైద్యపరీక్షలు అందించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ప్రైవేటు అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని రాజంపేటకు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వీరస్వామి మృతదేహం

కడప కోటిరెడ్డిసర్కిల్ : భాకరాపేట-కనుమలోపల్లె మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కడప రైల్వే ఎస్‌ఐ కథనం మేరకు...శుక్రవారం సాయంత్రం ఓ వ్యక్తి రైలు కిందపడి గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడని తెలిపారు. తమ విచారణలో మృతుడు వీరస్వామి (60)గా నిర్ధారణ అయిందన్నారు. మృతదేహం రిమ్స్ మార్చురీలో ఉందన్నారు. ఆచూకీ కోసం కడప రైల్వేపోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. సోమల మండలం కందుకూరుకు చెందిన శశికళ(19) శనివారం ఉదయం తన భర్త రాజుతో ద్విచక్రవాహనంలో బి.కొత్తకోటకు బంధువుల ఇంటికి బయలుదేరారు. చంద్రకాలనీ సమీపంలో రహదారిపై ఉన్న గుంతలో ద్విచక్రవాహనం అదుపు తప్పి పడ్డారు. ఈ ప్రమాదంలో శశికళ తీవ్రంగా గాయపడింది. కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు తాలూకా, కురిగేపల్లెకు చెందిన అశోక్(20) శనివారం మదనపల్లె మండలం ఎనుమలవారిపల్లెలో ఉన్న అమ్మమ్మ రాణెమ్మ వద్దకు వస్తుండగా చీకలబైలు వద్ద కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం నుంచి అదుపుతప్పి పడింది. స్థానికులు ఆమెను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె మండలం వైఎస్సార్ కాలనీకి చెందిన వెంకటరమణ (63) శుక్రవారం రాత్రి వలసపల్లె పంచాయతీ నవోదయ పాఠశాల వద్ద రహదారిపై నడుచుకుని వెళ్లుండగా కాటపల్లెకు చెందిన రెడ్డిప్రకాష్ ద్విచక్రవాహనంతో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆయన్ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూరి గుడిసె దగ్ధం



మంటల్లో కాలిపోతున్న పూరి గుడిసె

రాజుపాళెం : మండలంలోని తొండలదిన్నె గ్రామంలోని గాలిపోతుల త్యాగయ్య, ఆశమ్మకు చెందిన పూరి గుడిసె కాలిపోయింది. వస్తువులు కాలిపోయాయి. ఆశమ్మ శనివారం సాయంత్రం వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వారిద్దరు ఇంటిలో నుంచి బయటికి వచ్చారు. మంటలను అదుపు చేసేలోపే పూరి గుడిసె, తిండి గింజలు, దుస్తులు మంటలో కాలిపోయాయి. వాటి విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.